ప్రజాశక్తి

శుక్రవారం 9 జూన్ 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

కష్టాల్లో వ్యవసాయ నష్టాన్ని మోసే కౌల్దారు

- గుర్తింపు కార్డు జారీలో నిబంధనల మార్పునకు చట్ట సవరణ చేయాలి
- రైతుభరోసా, పరిహారం, రాయితీలు, రుణాలు వారికే ఇవ్వాలి
- కౌలురైతు సంఘం రాష్ట్ర జాతాలో నాయకుల డిమాండ్ - గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటన

ప్రజాశక్తి - చిలకలూరిపేట, పెదనందిపాడు

కౌలురైతు చట్టాన్ని సవరించి భూయజమాని సంతకం ఉంటేనే కౌల్దారుకు సిసిఆర్‌సి (గుర్తింపు) కార్డు ఇస్తామనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజార జాతా నెల్లూరు జిల్లా కొట్టిపాలెంలో ప్రారంభమై గురువారం గుంటూరు జిల్లా నాగులపాడు, పెదనందిపాడు పాలపర్రులో పర్యటించింది. అనంతరం 2లో

పల్నాడు జిల్లా వేలూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

జిపిఎస్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీలం వ్యతిరేకిస్తున్నాం

- ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందే
- కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలి
- తాజా నిర్ణయం ప్రకారం మాచర్ల కాలేజీలో 13 మందికి ఒక్కరే పర్మినెంట్
- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - మాచర్ల

సిపిఎస్ రద్దుకు బదులు జిపిఎస్ తెస్తామనే ప్రభుత్వ నిర్ణయాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీలం వ్యతిరేకిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

మాచర్లకు గురువారం వచ్చిన ఆయన స్థానిక రామాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని, అయితే 2014 జూన్ రెండు నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి మాత్రమే పరిమితం చేయడం వల్ల సుమారు నాలుగువేల మంది అవకాశాలు కోల్పోతున్నారని, తెలంగాణలో మాదిరిగా 2014 జూన్ నాటికి ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వ 2లో

హజ్‌హౌస్ నిర్మాణం

చంద్రబాబు నాయుడు

రాష్ట్రం కోసం దువా చేయాలి

- హజ్ యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపిన జగన్
- నంబూరు మదరసాలో హజ్ క్యాంప్ సందర్శన

వార్తలు మెయిన్‌లో

ఐక్యపోరాటాలతోనే వరికపూడిశెల సాధ్యం

- నీరున్న చోటే అభివృద్ధి : ఎమ్మెల్యే కెఎస్ లక్ష్మణరావు
- ప్రాజెక్టు సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం

వార్త మెయిన్‌లో

జాతాలో భాగంగా మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

హామీలను అమలు చేయకుంటే ఉద్యమం

గుంటూరు చేరిన మున్సిపల్ జాతాలో నాయకులు హెచ్చరిక

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ఉద్యమిస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామమేశ్వరరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జాతా గురువారం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో 2లో

నాయకులకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

హామీలను అమలు చేయకుంటే ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

వివిధ యూనియన్ల నాయకులు, మున్సిపల్ కార్మికులు స్వాగతం పలికారు. అనంతరం జిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేసే పని ఎవరూ చేయలేరని, వారికి లక్ష రూపాయలు జీతం ఇచ్చినా తక్కువే అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారని, ఇవి మాటలకే పరిమితమా అని ప్రశ్నించారు. రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ కార్మికులకు పిఆర్‌సి అమలు చేశారని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అముల చేయకుండా మోసం చేసిందన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత నెల 31వ తేది నుండి మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాతా జరుగుతుంటే టిడిపి కానీ, జనసేన కానీ కనీసం స్పందించలేదని అన్నారు. ఈ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రచార జాతా అనంతరం సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చెప్పారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి టి.నూకరాజు, ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐటియు గుంటూరు నగర తూర్పు కమిటీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాయకులు ఆది నికల్సన్, షేక్ ఖాసీంవలి, కె.నళినీకాంత్, గోవిందు, గోపి, జె.చినవెంకటస్వామి, మున్సిపల్ యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, పి.పూర్ణచంద్రరావు, షేక్ రబ్బాని, కాటం రాజు, ఎ.కోటేశ్వరరావు, కె.శౌరమ్మ, సామ్రాజ్యం, జి.ప్రసాదరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

కుల మత రాజకీయాలకు అతీతంగా మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కామర్తి పాపయ్య నాయుడు పిచ్చమ్మ జ్ఞాపకార్థం వారి మనవళ్ళు, మనవరాలి సహకారంతో స్థానిక మార్కెట్ పక్కన పిరానే పీర్ గౌసే ఆజమ్ దస్తగిరి జెండా చెట్టు దగ్గర మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టి.ఉమాశంకర్, కార్యదర్శి గుడివాడ పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఊయల చుట్టుకుని బాలిక మృతి

ప్రజాశక్తి-నాదెండ్ల

ఉయ్యాలలో ఆడుకుంటూ ఫ్యానుకు ఊయల చుట్టుకొని బాలిక మతి చెందిన సంఘటన మండల కేంద్రమైన నాదెండ్లలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై ఎ. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్లకు చెందిన తాడిశెట్టి గ్రేసి (11) గురువారం మధ్యాహ్నం ఫ్యాన్ కు చుట్టుకుని చనిపోయింది. తల్లి ఉమాదేవి పనిలోకి వెళ్లి వచ్చేసరికి బాలిక మతి చెంది ఉంది. నాదెండ్ల ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల్లో వ్యవసాయ నష్టాన్ని మోసే కౌల్దారు

(మొదటి పేజీ తరువాయి)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని వేలూరుకు చేరింది. ఆయా గ్రామాల్లో కౌలురైతులతో నాయకులు మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది జనాభా వ్యవసాయమే ఆధారంగా బతుకుతున్నారని, వ్యవసాయంలో 70 శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారని అన్నారు. అయితే ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయంలో వస్తున్న నష్టాలనూ కౌలురైతులే భరిస్తున్నారని చెప్పారు. రుణపరపతి లేకపోవడం, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలు పెరుగుదల, పెట్టుబడి ఖర్చు పెరగడం తదితర భారాలన్నీ కౌలురైతుల మీదే పడుతోందన్నారు. ఇంత చేసిన ప్రకృతి విపత్తులు సంభవించి పంట దెబ్బతింటోందని, అయినా పంటల బీమా, ఇతర పరిహారాలు కౌలురైతులకు దక్కడం లేదని అన్నారు. రిజర్వ్‌బ్యాంక్ నిబంధన ప్రకటన రూ.1.6 లక్షల వరకు హామీ లేకుండానే పంట రుణాలివ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని చెప్పారు. గతంలో సాగు ధ్రువ పత్రాలు కౌల్దార్లకు కొంత అక్కరొచ్చినా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ చట్టాన్ని రద్దు చేసిందని చెప్పారు. భూయజమాని సంతకాన్ని తప్పనిసరి చేస్తూ కొత్తగా చట్టాన్ని తెచ్చిందని, దీని ప్రకారం కౌలురైతులు కార్డులు పొందడమే కష్టమైందని ఆవేదన వెలిబుచ్చారు. ఫలితంగా రుణాలు, పంటల బీమా, నష్టపరిహారాలు, రైతు భరోసా, రాయితీలు, సబ్సిడీలన్నీ కౌలు రైతులకు దూరమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయంలో అప్పులపాలైన కౌల్దార్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, కౌల్దార్ల ఆత్మహత్యల్లో రాష్ట్ర దేశంలోనే రెండో స్థానంలో ఉందని గుర్తు చేశారు. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలురైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల ప్రకారం రైతు భరోసాను రూ.25 వేలకు పెంచాలని, కేరళ తరహా రుణ విముక్తి చట్టాన్ని తేవాలని, దేవాదాయ భూముల కౌలు రైతులందరికీ కార్డులు, రుణాలు ఇవ్వాలని కోరారు. ఓసీలైన కౌలురైతులకూ గుర్తింపు కార్డులిచ్చి రైతు భరోసాను వర్తింపజేయాలన్నారు. కౌలురైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 12న విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదగా మంగళగిరిలోని సిపిఎల్‌ఎ కార్యాలయం వద్దకు ధర్నా ఉంటుందని, కౌల్దారంతా హాజరవ్వాలని కోరారు. యాత్రలో భాగంగా పాలపర్రులో పాతబాపట్ల తాలూకా అమరవీరుల స్తూపం వద్ద నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి.లక్ష్మీపతి, కె.శివనాగేశ్వరరావు, బి.శంకరయ్య, కె.వెంకటశివరావు, కె.వెంకట సుబ్బారావు, డి.రమేష్‌బాబు, సిహెచ్.యానాదులు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, బి.కామేశ్వరరావు, ఎ.భాస్కరరావు, బి.గోవిందు, ఎ.శ్రీనివాసరావు, బి.అంకమ్మ, జి.అమ్మయ్య, బి.రాంబాబు, జి.ఏడుకొండలు, కె.దామోదరం, పి.వెంకటేశ్వర్లు, ఎస్.బాబు, కె.రోశయ్య, ఎం.విల్సన్, జయపాల్, బి.నతానియేలు, సుధాకర్, సామ్యేలు, కె.విజయ్‌కుమార్, ఎం.లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాలపర్రులో స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంగన్వాడీ కార్యకర్త హత్యకు కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - నరసరావుపేట

టంగుటూరు మండలం రావివారిపాలెంలో అంగన్వాడీ కార్యకర్త హనుమాయమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేసిన కేసులో అరెస్ట్ చేసిన వైసిపి నాయకులు సలవం కొండలరావును కఠినంగా శిక్షించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు మెటిల్డాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త హత్యను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి, సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి, ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, నాయకులు సిలార్ మసూద్, మస్తాన్‌రెడ్డి, ప్రసన్న, తేజస్విని, సాయి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా వెంకట శివప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను ఏలూరుకు బదిలీ అయ్యారు. తెనాలిలో సహాయ కార్మిక కమిషనర్‌గా పనిచేస్తున్న ధూళిపూడి వెంకటశివప్రసాద్‌ను అదనపు బాధ్యలతో నియమించారు. ఈ సందర్భంగా డివి ప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు తప్పనిసరిగా కార్మిక శాఖ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, అసంఘటిత రంగ కార్మికులు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ-శ్రమ కార్డు పొందాలని అన్నారు.

ఆయన పలువురికి ప్రాణదాత

ప్రజాశక్తి-తాడేపల్లి

రక్తదానం చేయడానికి కొంతమందికి భయాం దోళనలు, అపోహలు ఉంటాయి. వాటన్నంటినీ బేఖాతరు చేస్తూ అనేక మందికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు దొప్పలపూడి రాము. ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్టుగా పని చేస్తున్న రాము ఇప్పటికి వంద సార్లుకు పైగా ఆపదలో ఉన్న రోగులకు రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. గురువారం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి రక్తదానం చేసిన రాముని పలువురు అభినందించారు.

పిస్టల్ షూటింగ్ పోటీల్లో ముఖేష్‌కు రజతం

ప్రజాశక్తి-గుంటూరు



నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోపాల్‌లో జరుగుతున్న కుమార్ సురేంద్రసింగ్ మెమోరియల్ నేషనల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ 50 మీటర్ల ఫ్రీ పిస్టల్ జూనియర్ విభాగంలో రజత పతకం గెలిచాడు. కాగా బుధవారం జరిగిన 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ పోటీల్లో ముఖేష్ రాష్ట్రం తరపున కాంస్య పతకం గెలిచాడు.

జిపిఎస్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీలం వ్యతిరేకిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం ప్రకారమైతే మాచర్ల జూనియర్ కాలేజీలో 13 మంది కాంట్రాక్టు లెక్చరర్లలో ఒక్కరే రెగ్యులర్ అవుతారని చెప్పారు. ఉద్యోగులకు బదిలీ ప్రమోషన్లలో ఉమ్మడి జిల్లా ఆధారంగా జరుగుతున్నాయని, పల్నాడు జిల్లాలోని ఖాళీలన్నీ చూపించనందువల్ల ఇక్కడి ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం లేదని, ఈ ప్రాంత ప్రజల నష్టపోతారని తెలిపారు. పల్నాడు జిల్లాకు ప్రాధానమినిచ్చి బదిలీ ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదని, రాష్ట్రంలో 25 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలున్నాయని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతమైన మాచర్లలో పీజీ సెంటర్ ఏర్పాటుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గతంలోనే తీర్మానించినా అమలు కాలేదన్నారు. పీజీ సెంటర్ వస్తే భవిష్యత్తులో అవి యూనివర్సిటీలుగా రూపుదిద్దుకునే అవకాశం ఉందని చెప్పారు. సిఐటియు నాయకులు గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ందరికీ పర్మినెంట్ చేయాలని, ఎన్నికలప్పుడు అంగన్వా డీలకు ఇచ్చిన వాగ్దానాలనూ నెరవేర్చాలని కోరారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అచ్చంపేట లోని పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అదేవిధంగా తాళ్ళచెరువు పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా నేలకొరిగింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. విద్యుత్ నిలిపివేసి పడిపోయిన విద్యుత్ స్తంభాల వైర్లను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించింది. కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగి మెయిన్ లైన్ పై పడటంతో తీగలు తెగిపోయాయి. వర్షం బాగా లేకపోవడంతో విద్యుత్ శాఖాధికారులు త్వరితగతిన విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. కొన్ని కాలనీల్లీ సింగిల్ ఫేస్ ఫీడర్లు నేలకొరగడంతో మరమ్మతులు చేపట్టారు. **ముప్పాళ్ల:** మండలంలో గాలి,వాన భీభత్సం సృష్టించాయి. ఈదురుగాలుతో కూడిన వర్షం పడింది.ఈదురు గాలుల ధాటికి రోడ్ల వెంబడి ఉన్న వృక్షాలు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురు గాలుల ధాటికి రేకుల ఇళ్ళపై కప్పులు లేచిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విపరీతమైన ఎండ తీవ్రతకు ఒకసారిగా వాతావరణం చల్లబడడంతో కొంచెం ఉపశమనం కలిగింది.

అచ్చంపేట మండలంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

14 ఎకరాల గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - క్రోసూరు

బాణసంచా పేల్చడంతో నిప్పురవ్వలు ఎగిరి గడ్డివామిపై పడటం, అదే సమయంలో గాలి దుమారం రావడంతో మంటలు తీవ్రంగా వ్యాపించడంతో14 ఎకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం క్రోసూరులో జరిగింది. కొండ కింద బజారులో చనిపోయిన ఆది అంకమ్మరావు (75)మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తుండగా ఊరి చివర చెరువు వద్ద టపాసులు కాల్చారు. నిప్పురవ్వల ఎగిరి గడ్డివాముపై పడటంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలు ఆర్పడంతో అక్కడే ఉన్న మిగతా గడ్డివాములకు మంటలు వ్యాపించలేదు. ములుగూరు శ్రీనివాసరావు, ములుగురు వెంకట్రావు, ములుగూరు అశోక్, గట్ల శ్రీనివాసరావులకు చెందిన గడ్డివాములు ఈ ఘటనలో దగ్ధమయ్యాయి. రెండు లక్షల 80 వేల రూపాయలు గడ్డి తగలబడిందని బాధితులు తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - వినుకొండ

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వినుకొండ పట్టణం లోని రైల్ పేట నందు గురువారం సాయంత్రం చోటు చేసు కుంది. రైలు పేటకు చెందిన రజియా పురుగుమందు సేవిం చి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా గుర్తించిన కుటుంబ సభ్యులు రజియాని వినుకొండ పట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ సాంబశివరావు ఆస్పత్రికి చేరుకొని బాధితురాలు రజియాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రజియా తెలిపిన సమాచారం మేరకు వినుకొండ పట్టణానికి చెందిన న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్న సయ్యద్ ఖాసిం కు మొదటి భార్యతో విడాకులు తీసుకోగా తనను రెండో భార్యగా 16 నెలల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగిందన్నారు. వివాహం అయిన కొత్తలో అత్తింటి వారు ,భర్త చాలా ఆప్యాయంగా చూసుకున్నారని తర్వాత కాలం గడిచే కొద్దీ తన పుట్టింటికి కూడా వెళ్ళనిచ్చేవారు కాదన్నారు. ఈ క్రమంలో తాను గర్భం దాల్చడం జరిగిందని గర్భం దాల్చిన కొత్తలో చాలా ఆప్యాయంగా చూసుకునేవారని,

తర్వాత తనకు అబార్షన్ జరిగేందుకు తనకు తెలియకుండా మందులు ఇచ్చారని తెలిపారు . ఇటీవల కాలంలో తమ బంధువులు చనిపోతే పుట్టింటికి వెళ్లానని, అప్పటినుండి తనని అత్త మామలు ,భర్త ఇంటికి తీసుకు వెళ్లడం లేదని నాకు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని దీనిపై నా భర్త నాకు కావాలని కోర్టులో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. పిటిషన్ వేసిన దగ్గర నుంచి మరిన్ని వేధింపులు గురి చేయడం జరుగుతుందన్నారు. అత్త మామ భర్త పెడుతున్న వేధింపులు తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు వినుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పెదనందిపాడులో సేవ శక్తి ఆధ్వర్యంలో జరుగుతున్న వైయస్సార్ రాష్ట్ర స్థాయి పురుషుల వాలీబాల్ పోటీలు గురువారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ఆసక్తికరంగా జరుగుతున్నాయి. హైదరాబాదు బాపట్ల జట్ల మధ్య జరిగిన పోటీలలో బాపట్ల జట్టు గెలుపొందింది. చెన్నై కాకుమాను జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. ఈ పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతున్నాయి. అంపైర్లుగా ప్రేమ కుమార్, వెంకటేశ్వర్లు, ప్రసాద్.,రంజిత్, జెస్సి, చెన్నకేశవరెడ్డిలు వ్యవహరిస్తున్నారు. నిర్వాహక కమిటీ కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, గౌరవ అధ్యక్షులు షేక్ ఖాసీం పీరా, అధ్యక్షులు కూరేటి భూషయ్య సేవాశక్తి ఫౌండర్ కొమ్మినేని గోవి, అధ్యక్షులు శాంతిబాబు లు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరివేక్షిస్తున్నారు.

గెలుపొందిన బాపట్ల జట్టు

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపలిల్లలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. సమ్మర్ క్యాంపులో భాగంగా ఈ తనిఖీ చేశారు.ఆయన అక్కడికి వెళ్లే సమయానికి గ్రంథాలయంలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. సమ్మర్ క్యాంపు ఆవశ్యకత గురించి వారికి ఆయన వివరిం చారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

మలేరియా మాసోత్సవం సందర్భంగా గురువారం తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రావి రవీంద్రనాథ్ నగర్ లో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి కంఠ ఉమాకాంత్ ,హెల్త్ సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ షేక్ రషీద్ ,షేక్ నవీద్ పాల్గొన్నారు.

దొంత శివయ్య సేవలు అమూల్యం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రజానాట్యం మండలి కళాకారుడిగా సిపిఎం కార్యకర్తగా దొంత శివయ్య సిపిఎంకు అందించిన సేవలు అమూల్యమని సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు అన్నారు. మంగళగిరి మండలం ఖాజా గ్రామానికి చెందిన ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారుడు, సిపిఎం అభిమాని దొంత శివయ్య సంస్మరణ సభ కాజా గ్రామంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలో వేసి నివాళులు అర్పించారు. జె వి రాఘవులు మాట్లాడుతూ కళాకారుడిగా అనేక ప్రదర్శనను అందించి ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు, మాజీ సర్పంచ్ ఈదా నాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో వారి కుటుంబం అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భీమిరెడ్డి కోటేశ్వరి పాల్గొన్నారు.

మహిళా సంఘం నేత లక్ష్మీ సామ్రాజ్యం మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం పార్టీ సభ్యులు పోతురాజు నరసింహారావు భార్య, గ్రామ మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలు లక్ష్మీ సామ్రాజ్యం(79) గురువారం మృతి చెందారు. సామ్రాజ్యం దంపతులకు ఒక కుమారుడు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మహిళా సంఘంలో విస్తృతంగా పని చేశారు. గ్రామంలో 1969లో మహిళా సంఘం ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించగా ఆమె విశేష సేవలను అందించారు. కుటుంబాన్ని పార్టీ వైపు నడిపించడంలోనూ ఆమె కృషి ఎంతో ఉంది. ఆమె మృతికి సిపిఎం నేతలు నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, బి. కోటేశ్వరి, తమ్మా ప్రసాదరెడ్డి, ఆళ్ల సాంబిరెడ్డి, ఈదా ప్రతాప్ రెడ్డి, ఎస్. శేఖర్, గాదె రామారావు, అప్పిగట్ల ప్రకాశరావు ఎం శివయ్య, గాదే మాధవరెడ్డి నివాళులర్పించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-తెనాలి

అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. రూరల్ గ్రామం కంచర్లపాలెంకు చెందిన కఠెవరపు మోహన్ ఆటోనగర్లో అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి ఆరు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

షాకిస్తున్న కరెంటు బిల్లులు

- రెండింతలు పెరిగి జనం బెంబేలు
- వివిధ ఛార్జీల పేరుతో ప్రతినెలా భారం

ప్రజాశక్తి - చిలకలూరిపేట, పెదకూరపాడు



చిలకలూరిపేటలో ఒక సర్వీసుకు రెండింతలైన బిల్లు

చిలకలూరిపేటకు చెందిన చిన్న పూల దుకాణానికి గతనెల రూ.1058 బిల్లు రాగా ఈనెల రూ.2368 వచ్చింది.. ఒక వాటర్ ప్లాంట్ యజమానికి మార్చిలో రూ.9 వేల బిల్లు రాగా మేలో రూ.13 వేలు వచ్చింది. పెదకూరపాడు మండలం అబ్బరాజుపాలేనికి చెందిన ఒకరికి గత నెల రూ.550 వస్తే ఈనెల రూ.1098 వచ్చింది. పట్టణాలు, గ్రామాలు, సామాన్యులు, మధ్యతరగతి, ధనికులు అనే తేడా లేకుండా అధిక విద్యుత్ బిల్లులు వినియోగదార్లకు షాకిస్తున్నాయి.మొన్నటి వరకూ ఇంటి పన్ను, చెత్త పన్నుతో అల్లాడితే ఇప్పుడు కరెంటు బిల్లు షాకిస్తోందని, విద్యుత్ బిల్లులు షాపు అద్దెలతో సమానంగా ఉంటున్నాయని పలువురు దుకాణదార్లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

ఒక్కసారిగా మూడు ఇంధన సర్దుబాటు చార్జీలను బిల్లు కలపడంతో ఈ బిల్లులు రెట్టింపైనట్లు పలువురు చెబుతున్నారు. గతంలో 13 శ్లాబులుంటే వాటిని ఆరు శ్లాబులకు కుదించారని, దీంతో బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని మరికొందరు అంటున్నారు. మారుబోయిన శ్రీనివాసరావు అనే పూల దుకాణం నిర్వాహకునికి ఏప్రిల్ నెలకు వచ్చిన బిల్లుతో పోలిస్తే మే నెలలో రెంట్టింపు బిల్లు వచ్చింది. మున్సిపాల్టీకి పన్నులు, కరెంటు బిల్లులు, షాపు అద్దెలు ఇలా ప్రతిదీ భారం అవుతోందని, దుకాణం మూసేసి మరో దుకాణంలో గుమస్తా పనికి వెళ్లడమే నయమనిపిస్తోందని ఆవేదనకు గురయ్యారు.

ఒకటి రెండు తేదీల్లో తీయాల్సిన రీడింగ్‌ను ఆలస్యంగా తీయడం వల్ల యూనిట్లు పెరిగి శ్లాబ్ మారుతోందని, కొద్దిపాటి యూనిట్ల తేడా వల్ల అధికంగా బిల్లు చెల్లించాల్సి వస్తోందని మరికొందరు వాపోతున్నారు.

చిలకలూరిపేట పట్టనంలో 90 వేల వరకూ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు, గృహ వినియోగదారులకు కలిపి అదనంగా పడుతున్న భారాన్ని సగటున లెక్కిస్తే ఒక్కో కనెక్షన్‌కు రూ.వెయ్యి వరకూ భారం పడుతోందని, ఇది నెలకు రూ.9 కోట్ల వరకూ ఉంటుందని తెలుస్తోంది. పెదకూరపాడు మండలంలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 15,720 ఉన్నాయి. వీటిల్లో 3,343 కనెక్షన్లు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద సబ్సిడీ పొందుతుండగా మిగతా 10,529 కనెక్షన్ల వినియోగదారులపై వివిధ రకాల ఛార్జీల పేరుతో ప్రతినెలా భారాన్ని మోపుతున్నారు. 150-200 యూనిట్లలోపు ఉపయోగించే సామాన్యులకు సైతం బిల్లు రూ.800 నుండి రూ.1100కు పెరిగింది.

యూనిట్‌కు 40 పైసలు, దానికి మరో 80 పైసలు ట్రూఅప్ ఛార్జీల పేరుతో వసూలు చేయడం దుర్మార్గమని పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లను తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రజలపై భారాలేసే ఈ చర్యలు మానుకోవాలని కోరారు.

కౌల్దార్లందరికీ 'రైతుభరోసా' ఇవ్వాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

కౌలురైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జాతా మండల కేంద్రమైన ముప్పాళ్లకు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వస్తుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ తెలిపారు. కౌలురైతుల సమస్యలపై మండలంలోని నార్నెపాడు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ద్వారా కౌలు రైతులను గుర్తించి, భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బిసి కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తున్న విధంగానే ఓసీలకూ ఇవ్వాలని కోరారు. ప్రతి కౌలు రైతుకూ రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని, భూ యాజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై చేపట్టే ఆందోళనల్లో అందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.సాంబశివరావు, కె.ప్రభాకర్, పెద్దిరెడ్డి, మస్తాన్‌రావు, నాగేశ్వరరావు, ఐ.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదంలో విఆర్‌ఒకు కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడారు. భూయజమాని సంతకం నిబంధన వల్ల కౌల్దార్లు కార్డులు పొందలేకపోతున్నారని చెప్పారు. దీనివల్ల రైతు భరోసా, ఇతర పథకాలూ వీరికి వర్తించడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జీపుజాతా సత్తెనపల్లికి గురువారం వస్తుందని కౌలురైతులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.మేరమ్మ, ఎం.నరసింహారావు, ఆర్.పూర్ణచంద్రరావు, బి.రామారావు, షేక్ హుస్సేన్‌సా, వి.తులసి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్నంలోని చెరువుగట్టు బజార్ 14వ సచివాలయంలో కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడారు. బి.నాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఎం.నరసింహారావు, వెంకటేశ్వర్లు, ఎస్.పుల్లయ్య, జి.చిన్నోడు పాల్గొన్నారు.



ఓపెన్ వాలీబాల్ టోర్నీ విజేత పిడుగురాళ్ల

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్‌పి పాఠశాలలో వైసిపి ఎస్సీ మాదిగ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీ నుండి నిర్వహిస్తున్న ఓపెన్ వాలీబాల్ టోర్నీ విజేతగా పిడుగురాళ్ల జట్టు నిలిచింది. రెండో స్థానంలో చెన్నై అబ్బాస్ టీం, మూడో స్థానంలో హైదరాబాదు టీం, నాలుగో స్థానంలో బాపట్ల టీం నిలిచినట్లు నిర్వాహకులు తెలియజేశారు. విజేతలకు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బహుమతులను బుధవారం రాత్రి ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.75 వేలు, షీల్డ్, రెండో బహుమతిగా రూ.50 వేలు, షీల్డ్, మూడో బహుమతిగా రూ.30 వేలు, షీల్డ్, నాలుగో బహుమతిగా 20 వేలు, షీల్డ్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మాజీ జెడ్‌పిటిసి వి.రామిరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు చల్లా పిచ్చిరెడ్డి, వైసిపి యూత్ ప్రసిడెంట్ ఎం.సుదీర్, కౌన్సిలర్లు పి.ఆనంద్, కె.సుందరరావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సిహెచ్.స్వామి, ఎం.జాషువా పాల్గొన్నారు.

క్రోసూరులో ఏపీ మోడల్ ప్రవేశ పరీక్ష కేంద్రం కేంద్రం మార్పు

ప్రజాశక్తి - క్రోసూరు : మండల కేంద్రమైన క్రోపూరులోని ఏపీ మోడల్ స్కూల్లో ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించాల్సి ఉండగా కేంద్రాన్ని మార్పు చేసినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన సిఎం పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, పరీక్ష కేంద్రాన్ని పక్కనే ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలోకి మార్చామని తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న 196 మంది విద్యార్థులకు ఇబ్బందులేమీ రాకుండా రవాణా సదుపాయం ఏర్పాటు చేయాలని, రెండు కేంద్రాల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో మార్పులేమీ ఉండవని ప్రిన్సిపాల్ ఎన్.మేరీ సూజాన్ తెలిపారు.

ఆరోగ్య కేంద్రంలో థ్యాంక్యూ సిఎం కార్యక్రమం

ప్రజాశక్తి - నరసరావుపేట : మండల కేంద్రమైన రొంపిచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 'థ్యాంక్యూ సిఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేసినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, రాము, పారా మెడికల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏషియన్ హాస్పిటల్‌లో ఐవిఎఫ్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏషియన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఐవిఎఫ్ వైద్య సేవలను సంతానం లేని దంపతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని వినుకొండ రోడ్డులో గల ఏషియన్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఫెర్టిలిటి సెంటర్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఏషియన్ హాస్పిటల్ స్థాపించిన అనతికాలంలోనే పల్నాడు ప్రజలతో పాటు ప్రకాశం జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందిస్తున్నారని డాక్టర్ వంశీనాథ్‌రెడ్డి, డాక్టర్ త్రివేణిని అభినందించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ వంశీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో ఇప్పటికే జనరల్, ఆర్థో, గర్భిణులకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. లాభాపేక్షకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, తమ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సదుపాయం ఉందని అన్నారు. సంతానం కలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దంపతులు తమ హాస్పిటల్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కేర్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ టి.కొండారెడ్డి, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రొంపిచర్ల నూనత ఉపసర్పంచ్‌గా కొమ్ము నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నరసరావుపేట: మండల కేంద్రమైన రొంపిచర్ల పంచాయతి ఉపసర్పంచ్‌గా 13వ వార్డు సభ్యులు కొమ్ము నాగేశ్వరరావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు ఉపసర్పంచ్‌గా పనిచేసిన 12వ వార్డు సభ్యులు గెల్లి పున్నారెడ్డి అనారోగ్య కారణంగా తన పదవికి రాజీనామా చేయటంతో నూతన ఉప సర్పంచ్ ఎన్నిక చేపటగా ఎన్నికల అధికారిగా ఇఒపిఆర్డీ కె.విజయరాము వ్యవహరించారు. నూతన ఉపసర్పంచ్‌తో పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. ఉపసర్పంచ్‌ను వైసిపి నాయకులు సత్కరించగా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.చక్రారెడ్డి, నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.వీరారెడ్డి, పి.రమణారెడ్డి, కె.ప్రతాప్‌రెడ్డి, పి.వేణుగోపాల్ రెడ్డి, రేషన్ డీలర్ దొప్పలపూడి దిబ్బయ్య పాల్గొన్నారు.

పార్టీ హామీలను ఇంటింటికీ తీసుకువెళ్లండి : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో ఐదు కోట్ల ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తూ టిడిపి ఇచ్చిన మినీ మేనిఫెస్టోను టిడిపి శ్రేణులు ఇంటింటికీ తీసుకెళ్లాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు సూచించారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన టిడిపి నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, రాష్ట్ర అభివృద్ధికి తూట్లు పొడుస్తూ అన్ని రంగాలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ప్రజాధనాన్ని దోచుకోవడమే పనిగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్లు వెనక్కు మళ్లిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆయుబ్ ఖాన్, సాంబశివరావు, గోవింద నాయక్, ఆంజనేయులు, బాలయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

రేపు దుగ్గిరాల రానున్న రాష్ట్ర జాత

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన ఈమని అప్పారావు తదితరులు

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డు ఇవ్వాలని, కౌలు రైతు చట్టాన్ని సవరించాలని, కౌలు రైతుల జీవితాలను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 7వ నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన జాతా గురువారం గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలో పర్యటిస్తుందని వ్యకాస గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. బుధవారం దుగ్గిరాల ప్రజాసంఘాల కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సంద్భంగా అప్పారావు మాట్లాడారు. 9వ తేదీన పల్నాడు జిల్లాలో పర్యటించిన రాష్ట్ర జాతా 10వ తేదీన గుంటూరు జిల్లాకు వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో 10వ తేదీ దుగ్గిరాల, పెదకాకాని మండలంలో రాష్ట్ర ప్రచార జాతాను జయప్రదం చేయాలని అప్పారావు కోరారు. ఈ సందర్భంగా 12వ తేదీన విజయవాడ నుండి ప్రకాశం బ్యారేజీ మీదుగా సిసిఎల్ ఆఫీసు వద్దకు జరిగే పాదయాత్ర మరియు ధర్నా ను జయప్రదం చేయాలని. కౌలు రైతులు భారీగా హాజరవ్వాలని ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. అప్పారావు మాట్లాడుతూ సరళీకత ఆర్థిక విధానాల వల్ల వ్యవసాయం నష్టాల పాలవుతుందని దీనితో భూ యజమానులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వత్తులకు ప్రాంతాలకు వెళ్లారని అప్పటివరకు కూలి నాలి చేసుకునే పేద ప్రజలు ,దళితులు, బడుగు బలహీన వర్గాల వారు కౌలు వ్యవసాయంలోకి మారారని తెలిపారు. ఇతరుల పొలాల్లో పని పాట చేసుకునే కంటే తాము కౌలు తీసుకున్న పొలంలోనే పనిచేసుకుందామని కనీసం తన రెక్కల కష్టమన్న మిగులుతుందని ఆశపడ్డారని తెలిపారు. వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కౌలు చట్టాలను ఒక కలం పోటు తో రద్దు చేసిందని పైగా భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు కార్డులు ఇస్తామని నిబంధన చేర్చిందని దీనితో భూ యజమానులు కౌలు కార్డు ఇవ్వడానికి సంతకం పెట్టడానికి ముందుకు రావడంలేదన్నారు. ఫలితంగా కౌలు రైతులు ఏ సౌకర్యాలు పొందడం లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి నిర్వహించే రాష్ట్ర జాతాను, ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి ,రైతు సంఘం అధ్యక్షులు ఎన్. యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడ ప్రచారంలో ఎం.హరిబాబు

కౌలు రైతు చట్టాన్ని సవరించాలి

ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కౌలు రైతుల సమస్యల పరిష్కరించుకునేందుకు కౌలు రైతుల చట్టాన్ని (సిసిఆర్ సి) సవరించాలని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గుండిమెడ గ్రామంలో విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతు జాత, సిసిఎల్ కార్యాలయం వరకు పాదయాత్ర, ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం కౌలు రైతులు వ్యవసాయంలో పెను మార్పులు సంభవించడం వలన నష్టాలకు గురవుతు న్నారని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రకతి వైపరీత్యాలు సంభవించి నప్పుడు పంటల బీమా పొందలేక కౌలు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రుణ అర్హత కార్డు పొందాలంటే భూ యజమాని సంతకం తప్పనిసరి అని నిబంధన పెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. రైతుల సమస్యలపై జరుగు రాయబార కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రైతు భరోసాను 25 వేలకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు అన్నారు. కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం పల్లె కష్ణ, కౌలు రైతులు కుమార్, యోహాన్, అంతోను, చింటూ, సాంబయ్య పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం, వినతులు

మేడికొండూరులో వినతి

ప్రజాశక్తి- మేడికొండూరు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో ప ర్యటిస్తున్న రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ కోరారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మేడికొండూరు రెండవ సచివాలయ అధికారి డి దినేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్ చంచయ్య, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వరగాని గ్రామ సచివాలయంలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు కౌలు రైతు సంఘం రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు చుక్కా యానాదులు, రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు పోపూరి సుధీర్, చెన్నుపాటి సురేంద్ర, కట్టా సురేష్, పోపూరి రవి, గడగొట్టు అమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో ప్రచారం



పెదనందిపాడులో వినతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

కౌలు రైతులందరికీ భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వై బ్రహ్మేశ్వర రావు కోరారు. గురువారం మండలంలోనీ పెద్ద కొండూరు, గొడవర్రు, ఈమని, పేరుకలపూడి గ్రామాలలో కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌలు రైతు మండల అధ్యక్షుడు అమ్మిరెడ్డి. పెదపాలెం గ్రామ కౌలు రైతు కార్యదర్శి రాజేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన అంబటి రాయుడు

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇటీవల ఐపిఎల్‌లో విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్ మేనేజర్, క్రికెటర్ అంబటి రాయుడు గురువారం కలిశారు. ఎపిలో క్రీడా రంగం అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా క్రీడలను ప్రోత్సహించడానికి తాను ఆసక్తిగా ఉన్నట్లు రాయుడు తెలిపారు. దీని కోసం పటిష్టమైన కార్యక్రమాలు ప్రభుత్వం రూపొందిస్తుందని సిఎం హామీనిచ్చారు. ఈ సందర్భంగా సిఎస్‌కె టీమ్‌ను సిఎం అభినందించారు.

క్రీడా పరికరాలు అందచేస్తున్న పల్లవి, శైలజ తదితరులు

ముగిసిన వేసవి క్రీడా శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 తేదీ వరకూ నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిఇఒ ఎస్.పల్లవి, శాప్ బోర్డు మెంబర్ పి.శైలజ హాజరై క్రీడాకారుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనటం వల్ల పిల్లలు వారీరకంగా, మానసికంగా ఆయురారోగ్యాలతో ఉల్లాసంగా ఉంటారన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించటానికి ఈ క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతులమీదుగా క్యాంపు ఇన్‌ఛార్జిలకు క్రీడా సామాగ్రి, సర్టిఫికెట్లు అందచేశారు.

పదివేల కుటుంబాలకు ప్రయోజనం : డొక్కా

ప్రజాశక్తి - గుంటూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని వైసీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వర ప్రసాద్ అన్నారు. జిజిహెచ్ ఆవరణలో మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం పై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సి యం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. గత 20 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేస్తారని ఎదురు చూసారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వై ఎస్ జగన్ జగన్ మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు విని అధికారంలో రాగానే రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వీరి డిమాండ్ లను క్యాబినెట్ లో చర్చించి ఆమోదింప చేశారని ఆయన అన్నారు. దీనివల్ల పది వేల కుటుంబాలు సి యం కు ధన్యవాదములు చెబుతున్నారని ఆయన చెప్పారు. బానిస సంకెళ్ళ నుంచి విముక్తి లభించినట్లు గా ఉందని కాంట్రాక్టు ఉద్యోగులు యడవల్లి వెంకటేశ్వర రావు, సత్యవతి, కె తిరుమల దేవి అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మద్దుల జ్యోతి బాబు, దొంతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, యోహాను, రాధారాణి, బొట్టు శ్రీను, వైసీపీ నేతలు అత్తోట జోసెఫ్, తిప్పారెడ్డి రామకష్ణ రెడ్డి,ఝాన్సీ రాణి పాల్గొన్నారు

వైస్ చైర్మన్‌గా అత్తోట నాగవేణి ఏకగ్రీవం

ముగిసిన మున్సిపల్ వైస్‌చైర్మన్-2 ఎన్నిక - ఎన్నికకు టిడిపి దూరం

ప్రజాశక్తి-తెనాలి:

మున్సిపల్ వైస్ చైర్మన్-2 ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి వైస్ చైర్మన్-2గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆధ్వర్యంలో పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో గురువారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. మొతం 40 మంది సభ్యులుండగా వారిలో 32 మంది వైసిపి సభ్యులే. వారంతా ఎన్నికల్లో పాల్గొనగా, ఎనిమిది మంది టిడిపి సభ్యులు ఎన్నిక ప్రక్రియకు హాజరు కాలేదు. వైస్ చైర్మన్-2గా పనిచేసిన గుంటూరు కోటేశ్వరరావు గతేడాది డిసెంబర్ 29న రాజీనామా చేయటంతో, అప్పటి నుంచి కాళీగా ఉన్న వైస్ చైర్మన్-2 ఎన్నికకు ఇటీవలే ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కౌన్సిల్‌లో వైసిపికి పూర్తి బలం ఉంది. దీనికి తోడు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కూడా ఎన్నికలో పాల్గొన్నారు. ముందుగా వైస్ చైర్మన్-2 ఎన్నికకు 40వ వార్డు కౌన్సిలర్ అత్తోట నాగవేణి అభ్యర్థిత్వాన్ని 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ప్రతిపాదించగా, ఆయన ప్రతిపాదనను 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి బలపరచారు. నాగవేణి మినహా ఎవ్వరూ పోటీలో లేకపోవటంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గీతాంజలి శర్మ ప్రకటించారు. ఎన్నిక దృవీకరణను కమిషనర్‌తో కలిసి నాగవేణికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం వైస్‌చైర్మన్-2గా ఎన్నికైన నాగవేణిని అభినిందించారు. పురపాలక సంఘం అబివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగవేణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

నాగవేణికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి గీతాంజలి శర్మ, కమిషనర్ జస్వంతరావు

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో డిబిఆర్‌సి ఆధ్వర్యంలో దళిత మహిళలకు గురువారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డిబి ఆర్‌సి మహిళా కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎపిఎమ్ బాలస్వామి పాల్గొన్ని మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు, శ్రీనిధి, ఉన్నతి బ్యాంకు రుణాలు తీసుకుని చిన్న చిన్న వ్యాపా రాలు చేసుకుని, మీ కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని చెప్పారు. అనవసర ఖర్చులు తగ్గించుకుని, పొదుపు చేసుకోవాలని అవ కాశాలను వినియోగించుకుని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండి రాణించాలన్నారు. ఈ సందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు లక్షకు 35 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నారని, మ్యాన్ ఫ్యాక్చరింగ్ వర్క్ చేసుకుంటే అవ కాశాలు బాగుంటాయన్నారు. దళిత మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాగరాజు,నాగమల్లేశ్వరరావు, భాను, రాము లమ్మ, రమణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్తిపాటి ఫౌండేషన్' ఆర్థికసాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన నిరుపేద కుటుంబానికి చెందిన స్థానిక 7వ వార్డు నివాసి బి.కోటేశ్వరమ్మకు మెరు గైన చికిత్స నిమిత్తం ప్రత్తిపాటి ఫౌండేషన్ తరపున ఆర్థికసాయం అందజేసినట్లు 7 వార్డు టిడిపి అధ్య క్షులు షేక్ బాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కోటేశ్వరమ్మకు మెరుగైన వైద్య చికిత్స, మందులు ,ఇతర ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశామని, ఫౌండేషన్‌కు బాధితు రాలు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. 7వ వార్డు పార్టీ నాయకులు గొట్టిపాటి బాబు, షేక్ జహంగీర్, అనిల్ పాల్గొన్నారు..

కమ్యూనిటీ వైద్యశాలలో తనిఖీ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి కమ్యూనిటీ వైద్యశాలను డిసిహెచ్ఎస్ డాక్టర్ బి వి.రంగారావు ఆక స్మికంగా బుధవారం రాత్రి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి ఆయన తెలుసుకున్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు ఆయనకు ఆ విషయం తెలిపారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చందూలాల్ నాయక్‌తో మాట్లాడుతూ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య మరింత పెరిగేలా చేయాలని, గతంలో 'సి' గ్రేడ్ ఉన్న ఆసుపత్రిని నేడు 'ఎ' గ్రేడ్ లో ఉంచిన వైద్యులను, నర్సులను సిబ్బందిని అభినం దించారు. వైద్య సిబ్బంది మరింత కష్టపడి పనిచేసి ఆసుపత్రి అబివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. బ్లడ్ స్టోరేజ్ యూనిట్ తదితర సౌకర్యాలను అందుబాటులో తీసుకొని రావాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి మరింత మెరుగైన సేవలను రోగులకు అందించాలని వైద్యులను,నర్సులను, సిబ్బందిని కోరారు.

రూ.13 లక్షలతో కొత్త పైప్ లైన్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ

పట్టణంలోని కళా మందిర్ సెంటర్ నుండి గాంధీ పార్క్ రోడ్ లోని తాగునీటి పైప్ లైన్‌కు తరచూ లీక్‌లు ఏర్పడీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ గురువారం అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆ పైప్‌ల స్థానంలో కొత్త పైప్ లైన్లను రూ.13 లక్షలతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని తాషా బజార్, ఇస్లాంపేట, బాబు గారి తోట, ఒడ్డెర పాలెం, రాగన్నపాలెం, గుండయ్య తోట, సుభాని నగర్, పొన్నవారి వీధి, బిట్రా వారి బజారు,బొందిలి పాలెం, వగైరా ప్రాంతాలకు ఈ నెల 12,13 తేదీల్లో రెండు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. 14వ తేదీ నుంచి ఆయా చోట్ల తాగునీరు యథావిధిగా సరఫరా చేస్తామని చెప్పారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలోని 75 తాళ్లూరు జడ్ పి హైస్కూల్ హెచ్ఎంగా అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం బాధ్య తలు స్వీకరించారు. మునుగోడు జడ్ పి పాఠశాల నుండి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్ ఎం అంకాళ్ళ శాంత భూలక్ష్మి మందపాడు జడ్ పి హైస్కూల్ కి బదిలీ అయ్యారు. గారపాడు జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా శివ నాగేశ్వరావు బదిలీపై వచ్చారు. నిడమర్రు జడ్పీ పాఠశాల నుండి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన చంద్ర శేఖరరావు గొట్టిపాడు జడ్పీ హైస్కూల్ కు బదిలీ అయ్యారు

ప్రజాశక్తి-అమరావతి

మండల పరిధిలోని మునుగోడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విజయ్ భాస్కర్ గురువారం బాధ్యత స్వీకరించారు.ఆయన గతంలో వినుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. బదిలీలో భాగంగా మునుగోడు హైస్కూల్ హెచ్ఎం గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అన్నపురెడ్డి.శ్రీనివాస్ రెడ్డి 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా బదిలీ అయ్యారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న హెచ్ఎంలు విజయభాస్కర్, శ్రీనివాసరెడ్డి

మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉడతా శ్రీలక్ష్మి కవిత సూచించారు. మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా నివారణ మహోత్సవం అవగాహనా ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి కవిత మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా, డ్రైనేజీ నందు నీటి నిల్వలు లేకుండా అరికట్టాలని, ఆశా ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా ఆశా ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి మొఘల్ శుభాన్ బేగ్,సి హెచ్ఓ సీతారావమ్మ, ఆరోగ్య విస్తరణాధికారులు పి.వెంకటరావు, షేక్ మహమ్మద్ ఖదీర్, సూపర్ వైజర్లు వెంకటేశ్వర్లు, మార్గరెట్, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫణిదంలో మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

అరాచక పాలనను అంత మొందించండి: టిడిపి

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట నియోజకవర్గంలోని జమిందార్ ఫంక్షన్ హాల్ కోట సెంటర్లో గురువారం టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు,ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ అవినీతిని ప్రశ్నించిన వారి పై దాడులు చేస్తూ అరాచకపాలన సాగిస్తున్న జగన్ రెడ్డి అరాచక పాలనను అంతం చేయడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని అన్నారు. రాజ్యాంగ బద్ధ వ్యవస్థల పైన,బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపైన వ్యక్తిగత దూషణలు చేస్తూ... అమాయకులపై అక్రమ కేసులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్న వైసీపీ గూండాలను 2024 ఎన్నికల్లో ఓడించి రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని కోరారు. ల్యాండ్,శాండ్,వైన్,మైన్,గంజాయి,గుట్కా,అక్రమ రేషన్ బియ్యం మాఫియ,ప్రజల నుంచి కప్పం వసూలు చేస్తూ వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజలను హింసిస్తున్నారని జగనాసుర, సామంత అవినీతి రెడ్డి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాలన అంతానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. .వైసీపీ మళ్ళీ అధికారంలోకి వస్తే ప్రజల వ్యక్తిగత ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ ఉండదని, వైసీపీ గూండాలు రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మారుస్తారని విమర్శించారు.

'అన్న క్యాంటీన్' ద్వారా ఉచిత భోజనం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణములో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ద్వారా ఉచిత భోజన పంపిణీ కార్యక్రమం గురువారం నాటికి 10 వ రోజుకి చేరింది. గడియార స్తంభం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు 10వ రోజు 440 మందికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో టిడిపి షేక్ మస్తాన్ వలి (కె.బి.రోడ్డు), అద్దంకి ఉదయ్ శంకర్ సింగ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ కరీమ్ పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

చాగంటివారిపాలెం ఉపసర్పంచ్‌గా మౌలాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

చాగంటివారిపాలెం ఉప సర్పంచ్‌గా బోడ్లపాటి మౌలా లి ఎన్ని కయ్యారు. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇటీవల ఉప సర్పంచ్ పదవికి మారూరి శ్రీలక్ష్మి రాజీనామా చేశారు. అనంతరం ఎన్నికల కమి షన్ నుంచి ఆదేశాలు రావడంతో ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి రూపావతి ఎన్నికల ప్రక్రియను చేపట్టారు. 9వ వార్డు మౌలాలికి ఎన్నిక ధృవీకరణపత్రం అందజేశారు. ఉప సర్పంచ్‌గా మౌలాలి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా గాయత్రీ లక్ష్మణ్, గ్రామపెద్దలు మధిర రామ్మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆరా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో రోష్ని సర్వీంగ్ సొసైటీలో 98 మంది హెచ్ఐవి/ఎయిడ్స్ బాధితులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ విష యాన్ని రోష్ని సర్వీసింగ్ సొసైటీ ప్రతినిధి జిలాని బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆరు నెలలుగా హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు ప్రతి నెలా రెండో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఇందులోభాగంగా పరీక్షలు నిర్వ హించామని, వారికి భోజన సదుపాయం కల్పించినట్లు వివ రించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రమణ, హెచ్ఐవి కౌన్సిలర్ సుధాకర్, అనిత, నాగేంద్ర, పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి పున:విగ్రహ ప్రతి ష్టా మహోత్సవం సందర్భంగా ఆయుష్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులకు తరుణ వ్యాధులకు చికిత్స చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన దేవాలయ శంకుస్థాపనకు వట్టికుంట ఛారిటబుల్ ట్రస్ట్ తరపున వట్టికుంట శేషగిరిరావు తమ్ముడు వట్టి గుంట భాను ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోపాల్ నాయక్ , స్వామి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ ,బాలాజీ నాయక్, ప్రసాద్ నాయక్ ,కోటేశ్వరమ్మ, బుక్యా హన్మంతరావు నాయక్, సాగరిక, శివ నాగమణి ,గ్రామ పెద్దలు భూక్య బాలాజీ నాయక్ , బాణావతు బాలు నాయక్ , పూజారులు అనంతాచార్యులు, హరికాంత్ గౌతమ్, ప్రశాంత్ గౌతమ్ పాల్గొన్నారు.

'నయవంచక ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

ప్రజాశక్తి-పెదకూరపాడు

నయవంచక ప్రభుత్వాన్ని గద్దిదించాలని పెద్దకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పై చర్చా వేదిక నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ మోసపూరిత మాటలతో జగన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలు ఇతర దేశాలు వలస పోతున్నారన్నారు. రాష్ట్రంలో చదువుకోడానికి విద్యార్థులకు అవకాశాలు లేని దుస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో ఎటువంటి అభివృద్ధి జరగ లేదని విమర్శించారు. రోడ్లు వేసిన దుస్థితి ఎక్కడ లేదన్నారు. ఇప్పుడు శంకుస్థాపన చేసి ఎప్పుడూ పూర్తి చేస్తారని నిలదీశారు. మినీ మేనిఫెస్టోని ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట క్రోసూరు బెల్లంకొండ అమరావతి పెదకూరపాడు మండలాల నాయకులు రమేష్ గోపాలరావు అప్పారావు గంగాధరు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు నూతన ఎంపిడిఓగా రాజగోపాల్

ప్రజాశక్తి- పెదనందిపాడు

పెదనందిపాడు మండల నూతన ఎంపీడీవో గా యనకడల రాజగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు, మాచవరం మండలంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బదిలీలో భాగంగా పెదనందిపాడు మండలానికి వచ్చారు, గత తొమ్మిది నెలల నుంచి ఇంచార్జ్ ఎంపీడీవో ఎన్.సాయిలీల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు, మం డలంలో తాగునీరు, వాడుకనీరు సమస్య తీవ్రంగా ఉందని, వీటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మేడికొండూరు ఎంపిడిఓగా ప్రభాకరరావు

ప్రజాశక్తి- మేడికొండూరు

మేడికొండూరు మండల పరిషత్ అభివద్ధి అధికారిగా కుంచం ప్రభాకర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవో గా పనిచేసిన ముప్పవరపు శోభారాణి సాధారణ బదిలీలో భాగంగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఇఒపిఆర్‌డి రవికుమార్

మేడికొండూరు ఉపసర్పంచ్ గా అనూషా రాణి

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం మేడికొండూరు గ్రామపంచాయతీ సచివాల యంలో జరిగింది. ఆకస్మిక ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియలో ఎంపీ కిలో భాగంగా జరిగిన ఎన్నికలో గ్రామ ఒకటో వార్డు సభ్యురాలు అయిన పాములపాటి అనూష రాణి ఎంపికయ్యారు. రిటర్నిం గ్ అధికారిగా ఈఓపిఆర్డి పి. రవికుమార్ వ్యవహరించినట్లు ఎంపిడిఒ కె. ప్రభాకరరావు తెలిపారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, సిబ్బంది

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎఎస్ఎన్ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు పొందారు. బ్యాచి లర్ ఆఫ్ ఫార్మసి, మాస్టర్ ఆఫ్ ఫార్మసి చదువుతున్న 70 మంది క్యాంపస్ సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. దివీస్ లేబొరేటరీ, హెటిరో డ్రగ్స్, ఎపి సోర్స్ అండ్ అరబిందో ఫార్మా కంపెనీల ప్రతినిధులు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రమణ చెప్పారు. హ్యూమన్ రిసోర్స్, బృంద సభ్యులు క్వాలిటీ అష్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, రీసెర్చ్, మెడికల్ కోడింగ్ విభాగాల్లో జరిగిన ఎంపికల్లో 75 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ, అనం తరం వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఎంపిక ప్రక్రియలో ప్లేస్ మెంట్ అండ్ ట్రెయినింగ్ ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ షేక్ అంజాద్ ఆలీ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మి కుల సంతకాల సేకరణలో పాల్గొన్న సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురు వారం మహానాడు, బోటు యార్డు వద్ద మున్సిపల్ కార్మి కుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సిఐటియు నిర్వహిస్తున్న ఆం దోళనలకు కార్మికవర్గం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పేదలను గొప్పవారిగా చేసేలా మ్యానిఫెస్టో: టిడిపి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం తెనాలి ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వ హించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ నినాదంతో నియోజకవర్గ చర్చా వేదికకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శ్రీకారం చుట్టారు. మహానాడు సమా వేశం ద్వారా టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విడుదల చేసిన తొలివిడత మ్యానిఫెస్టోను ఆలపాటి వివరించారు. మండల, గ్రామ, పట్టణ స్థాయి సమా వేశాలు ద్వారా తెలుగుదేశం పార్టీ లక్ష్యాలను ప్రజలకు వివరించి పూర్వ పురోగతి సాధించాలని యువతకు సూచించారు. నాడు ప్రకటించిన మౌలిక వసతుల కల్పన తో పాటు నేటి మహానాడులో ప్రకటించిన మ్యానిఫెస్టో పేదవారిని గొప్పవారిగా చేసేలా ఉన్నా యని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు ఎదుర్కుంటున్న సమస్యలపై ఏకరవు పెట్టారు. ఇసుక, మద్యం మాఫియాల ద్వారా రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీలను గంగలో తొక్కుతూ సామాన్యుని నడ్డి విరుస్తున్నారని ఎద్దేవాచేశారు. పరిశ్రమలు స్థాపణలో మొండిచెయ్యి చూపించి యువకులను నిరుద్యోగులగా చేసారని అన్నారు. ఇసుక మాఫియా, కల్తీ మద్యం, గంజాయి ద్వారా తన సొంత ఖజానాను నింపుకున్నట్లు తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కషి చేయాలని సూచించారు.

తొలివిడత మేనిఫెస్టో గోడపత్రాలని విడుదల చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-మంగళగిరి

ప్రజల సంక్షేమం, రాష్ట్రాభిద్దే ధ్యేయంగా టీడీపీ రూపొందించిన మేనిఫేస్టోను ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్లాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్ లో టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నందం అబద్దయ్య అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశంలో టిడిపి మేనిఫేస్టోపై చర్చించారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ ఎన్నికల వరకు నాయకులు, కార్యకర్తలంతా ప్రజల్లోనే ఉండాలన్నారు. తొలివిడత మేనిఫేస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాలు, వ్యవస్థలకూ నష్టం కలిగిందన్నారు. సమావేశంలో పి.శ్రీనివాసరావు, డి.రాజు, పార్థసారథి, వి.వెంకట్రావు, కె. శ్రీఅనిత పాల్గొన్నారు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్యం

- అందుబాటులో 63 రకాల రక్త పరీక్షలు
- గర్భిణిల కోసం అల్ట్రా సౌండ్ స్కానింగ్
- హృద్రోగ నిర్ధారణకు ఈసీజీ సదుపాయం
- పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ షేక్ హుస్సేన్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పేద,దిగువ,మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ వైయస్సార్ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయ డం జరిగిందని పొన్నూరు సాంబశివ నగర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ షేక్ హుస్సేన్ అన్నారు. గురువారం ఆయన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాల గురించి వివరించారు. ఈ కేంద్రంలో 63 రకాల రక్త పరీక్షలు చేస్తామని షేక్ హుస్సేన్ చెప్పారు. లివర్, కిడ్నీ, బ్లడ్ గ్రూప్, హెచ్ఐవి,హెచ్‌బిఎస్ తదితర పరీక్షలు చేస్తామన్నారు. 172 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. షుగర్,బిపి, దగ్గు,జ్వరంతో పాటు అన్ని సాధారణ రోగాలకు మందులు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే, పది పడకల వార్డు, లేబర్ వార్డు ఉన్నాయని, చిన్నపిల్లలకు వ్యాక్సిన్లు ఇక్కడే వేస్తున్నట్లు చెప్పారు. అల్ట్రా స్కాన్, ఈసీజీ సౌకర్యం కూడా ఇక్కడ అందుబాటులో ఉందని, ప్రజలు ఆరోగ్య కేంద్రం సేవ లను సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. పది బెడ్లతో మిని వార్డును కూడా ఏర్పాటు చేశామని, సాధారణ వ్యాధులు బిపి షుగర్ తదితర పేషెంట్లకు ఇక్కడ వైద్య పరీక్షలు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు ప్రతి శని వారం ఎముకల వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉం టారు. డ్రెస్సింగ్ రూమ్, ఒపి వార్డులు 2, వెయిటింగ్ హాల్, మీటింగ్ హాల్, ల్యాబ్ లు ఉన్నట్లు చెప్పారు. కుక్క కరిచిన వారికి యాంటీ రేబిస్, పాము కరిస్తే యాంటీ వెనమ్‌లు అందుబాటులో ఉన్నట్లు వివరిం చారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియో గం చేసు కోవాలని కోరారు.

తాడికొండ ఎండిఓగా అత్తోట దీప్తి

ప్రజాశక్తి-తాడికొండ

తాడికొండ నూతన ఎండిఓ గా అత్తోట దీప్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. దీప్తి వట్టిచెరుకూరు మండలం నుండి బదిలీపై తాడికొండ వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. దీప్తిని సిఐటియు నాయకులు రైతు సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు యడ్లపల్లి గాంధీ రాంమోహనరావు, రైతు సంఘం నాయకులు కనగాల పూర్ణ చంద్రరావు, చింతల భాస్కరరావు, అంగన్వాడీ నాయకులు సుబ్బాయమ్మ కార్య కర్తలు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయండి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట గురు వారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యులు, అనంతరం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రభు త్వ యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 3,000 ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని, యూనివర్సిటీలలో కోర్సులు పెంచాలని, నిలిపివేసిన కోర్సులను పున:ప్రారం భిం చాలని, విశ్వవిద్యా లయాలను వైసిపి కార్యాలయాలుగా మారుస్తున్న యూని వర్సిటీల విసి ల పై, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం హైయర్ ఎడ్యు కేషన్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి. జాన్సన్ బాబు, ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, ఉపాధ్యక్షుడు జ్ఞానదీప్, సాయి, శ్రీనాథ్, గణేష్, పద్వి, బన్నీ, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయున్ని సన్మానిస్తున్న అధికారి కాసిం

తురకపాలెం జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎంగా తిరుమలేష్

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని మంగళగిరి పాడు తురకపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా ఎ.తిరుమలేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. ఇదిలా ఉండగా, ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఎండి ఖాసిం స్కూలును ఆకస్మిక తనిఖీ చేశారు. నూతనంగా విధులకు హాజరైన తిరుమలేష్ ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన ఫలితాలు సాధించే దిశగా అధ్యాపకులు విద్యా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొర్రపాడు ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు రబ్బాని, పాఠశాల కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీతను త్వరితగతిన పూర్తిచేయాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

వర్షాకాలానికి ముందే నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. వ్యక్తిగత సెలవులు పూర్తి చేసుకొని, గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లతో కీర్తి చేకూరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీయడానికి ప్రాంతాల వారీగా టెండర్లు పూర్తి అయ్యాయని, ఆయా ప్రాంతాల్లో సంబందిత ఏ.ఈ.లు, ఎమినిటి కార్యదర్శులు పూడికతీత పనులను దగ్గర ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో ఏ ప్రాంతంలోను డ్రైన్లు పొంగి ప్రజలు ఇబ్బందులు పడకూడదన్నారు. పూడిక తీసిన తర్వాత ఏ.ఈ.లు పని పూర్తీగా జరిగిందని ధృవీకరించాలన్నారు. అలాగే నగరంలో వేసవి దష్ట్యా ఎక్కడా తాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా, కలుషిత నీరు సరఫరా లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో శ్యాంపిల్స్ తీయాలని, ఎక్కడైనా కలుషిత నీరు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియచేయాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణ పనులు వేగంగా జరగాలని నోడల్ అధికారులు ప్రతి రోజు లేఅవుట్ పనులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.జగనన్నకు చెబుదాం, నగరపాలక సంస్థ ఫిర్యాదుల సెంటర్‌కు అందే ఫిర్యాదుల పరిష్కారానికి విభాగాల వారిగా ప్రత్యేక సిబ్బందిని కేటాయించి ఎప్పటికప్పుడు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలన్నారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజ, ఎస్.ఈ. భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్ర, డిసిపి మూర్తి పాల్గొన్నారు.

ఉద్యమంతోనే డిమాండ్లు సాధించుకున్నాం

ఉద్యమాన్ని విరమిస్తున్నాము : ఏపి జెఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఉద్యమం ద్వారానే డిమాండ్లు సాధించుకున్నామని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత ఐక్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అమరావతి జెఏసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఎంతవరకైనా పోరాడతామన్నారు. ఏపి జెఏసి అమరావతి 4వ ప్రాంతీయ సదస్సు గురువారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో జెఏసి జిల్లా చైర్మన్ కె.సంగీతరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత స్థానిక మూడు బొమ్మల సెంటర్ నుండి వేదిక వద్దకు భారీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో బొప్పరాజు మాట్లాడుతూ ప్రధాన డిమాండ్లు అన్నీ నెరవేరిన నేపథ్యంలో మూడు నెలల ఉద్యమాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. సమస్యలు పరిష్కరించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన సమస్యలు, వివిధ శాఖల్లోని ఉద్యోగుల సమస్యలపై నిర్ధిష్టమైన డిమాండ్లతో పోరాడతామని చెప్పారు.మూడు దశల్లో జరిగిన 92 రోజుల ఉద్యమంలో ప్రతి దశలోనూ డిమాండ్లు పరిష్కరించుకున్నట్లు వివరించారు. ముఖ్యంగా 47 డిమాండ్లకుగాను 37 ప్రధాన డిమాండ్లు నెరవేరాయని, మరొక 10 డిమాండ్లకు సంబంధించిన అంశాలు సంబంధిత సెక్రెటరీలతో చర్చించాల్సిన అవసరం ఉందని, త్వరలోనే వాటికీ పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. మొదటి నుంచి తాము పాత పెన్షన్ విధానానికే కట్టుబడి ఉన్నామని, జిపిఎస్‌కు ఎక్కడా ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గత పిఆర్‌సిలో కూడా వేతనాలు తగిన విధంగా పెరగలేదన్నారు. వారి సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో కృషి చేస్తామని చెప్పారు. ఏ శాఖ ఉద్యోగికి అన్యాయం జరిగినా అక్కడ ఎపి జెఏసి అమరావతి వారికి అండగా ఉంటుందని చెప్పారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగారావు సభలో సౌహార్ధ సందేశం ఇచ్చారు. కొన్ని డిమాండ్లైనా సాధించుకున్నందుకు అభినందనలు తెలిపారు. అయితే ప్రభుత్వాలు మొత్తంగా ఉద్యోగులు, కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారికి చట్టబద్దంగా ఇవ్వాల్సిన సౌకర్యాలు ఇవ్వకుండా నిరాకరిస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, బ్యాంకులు, రైల్వేలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ జనరల్ పి.దామోదర్‌రావు, అసోసియేటెడ్ చైర్మన్ టివి ఫణీ పేర్రాజు, ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేసన్ సెక్రెటరీ జనరల్ సిహెచ్.కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమోహనరావు, ఎపి జెఏసి రాష్ట్ర సెక్రెటరీ జ్యోతి, జిల్లా సెక్రెటరీ జనరల్ కిరణ్ తదితరులు ప్రసంగించారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి :మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని ఏపీ మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కార్మికులు, ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ గత నెల 30వ తేదీన ఇచ్చాపురం నుండి బయలుదేరిన రాష్ట్రస్థాయి మున్సిపల్ ప్రచార జాత గురువారం మంగళగిరి చేరుకుంది. ఈ సందర్భంగా జాతా బృందానికి మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సిఐటియు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆర్ వేణు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు పోరాటం తప్ప మరో మార్గం లేదని అన్నారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిపై పాలకులకు కనికరం లేదని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కార్మికులకు వేతనాలు పెరిగాయని అన్నారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీల తీరు ఒకటిగానే ఉందని అన్నారు. ముఖ్యమంత్రి సీటు కోసం తప్ప కార్మికుల సమస్యల పట్ల ఆ పార్టీలకు ముగ్గురు ఒకటిగానే ఉన్నారని అన్నారు. అధికారంలో ఉన్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యతిరేకత ఉందని అన్నారు. కార్మికులకు నష్టం కలిగించే విధానాలను ఆలంబిస్తుందని విమర్శించారు. కార్మికుల పట్ల వారి సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాటం చేసేది సిఐటియు సంఘమేనని అన్నారు. ఎర్రజెండా మాత్రమే కార్మికుల సమస్యలు పరిష్కారం కొరకు పని చేస్తుందని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ ఎంటిఎంసీ పరిధిలో ఉన్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. అనేకసార్లు పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందని అన్నారు. అయితే వేతనాల్లో మాత్రం చాలా తేడా ఉందని అన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకురాలు లక్ష్మీ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసేది ఎర్ర జెండా అని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు, రాష్ట్ర కార్యదర్శి టీ నూకరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు వరలక్ష్మి, నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య, సిఐటియు మంగళరు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, యూనియన్ నాయకులు పి పూర్ణ, మంగయ్య పాల్గొన్నారు.

తాడేపల్లిలో

తెనాలిలో

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ :మునిసిపల్ కార్మికుల హక్కుల సాధన కోసం మే 31 నుంచి ఈ నెల 9 వరకు జరుగుతున్న సీఐటీయూ ప్రచార జాత పొన్నూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐలాండ్ సెంటర్‌లో కార్మికులనుద్దేసించి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు,గుంటూరు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నేతాజీ ప్రసంగించారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్:మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పోరాటాల ద్వారానే సాధ్యమౌతాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం అన్నారు.తెనాలిలో జాతా బృందానికి సిఐటియు నాయకులు, తెనాలి మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. సమావేశంలో నాగభూషణం మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం, కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీలు నెరవేర్చడ్డంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిదన్నారు. మున్సిపల్ కార్మికులు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు ఈఎస్ఐ, పిఎఫ్ లను వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె నాగేంద్రబాబు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏటీఎం నాగరాజు, ఎన్ లక్ష్మీనారాయణ, గోపి రాష్ట్ర నాయకులు సుంకర రవి, కష్ణవేణి, పుల్లయ్య, రామాంజనేయులు, జిల్లా సిఐటియు కార్యదర్శి నేతాజీ, మున్సిపల్ గౌరవాధ్యక్షులు హుస్సేన్ వల్లి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి: గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఇచ్చిన హామీలను నేటి ముఖ్యమంత్రి అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన సిఐటియు జాతా ప్రకాష్‌నగర్ సెంటర్‌కు చేరుకుంది. సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆధ్వర్యంలో జాతాకు రాజధాని, తాడేపల్లి మున్సిపల్ కార్మికులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన సభకు సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2019లో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ నేటికీ అమలు కాలేదన్నారు. వెంటనే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.ముత్యాలరావు, ఎం.రవి, వేముల దుర్గారావు, వెంగమ్మ, రాచూరి వేణు, వనమా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి:మున్సిపల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాత రాష్ట్రంలో అనేక పట్టణాల్లో పర్యటిస్తూ గురువారం ఉదయం సత్తెనపల్లి పట్టణానికి చేరుకున్నది.ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులను కలుసుకొని

సత్తెనపల్లిలో

మంగళగిరిలో

పొన్నూరులో

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్షులు చింతకుంట్ల పెద వెంకయ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో కార్మికులు పలు సమస్యలను జాతా బృందానికి తెలిపారు. సత్తెనపల్లి మున్సిపల్ కార్మికులకు గత రెండు నెలలుగా హెల్త్ అలివేన్సులు రావడంలేదని, రక్షణ పరికరాలు మాస్కులు, గ్లౌజర్లు, గంబుట్లు ,చెప్పులు, శానిటైజర్లు, సబ్బులు, నూనెలు వంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని అన్నారు. పారిశుద్ధ్య పనిముట్లు చీపుర్లు,పారలు, గంపలు ఇవ్వడం లేదని జాతా బందానికి వివరించారు. పట్టణ ప్రజానీకానికి అనుగుణంగా 200 మంది కార్మికులు కావాల్సి ఉండగా కేవలం 130 మందితోనే పారిశుధ్య పనులు చేయించడంతో కార్మికులకు పని భారం పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాత బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సత్తెనపల్లి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగిపరపు చంద్రకళ, సత్తెనపల్లి యూనియన్ కార్యదర్శి కమల, సిఐటియు మాజీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సత్తెనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మాజీ గౌరవ అధ్యక్షులు మామిడి జగన్నాధ రావు, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం హరిపోతురాజు, నాయకులు రొంపిచర్ల పురుషోత్తం,నాయకులు షేక్ సైదులు, మంద సైదేశ్వర రావు,జడ రాజకుమార్, ధరణికోట పుల్లారావు,అనుముల వీర బ్రహ్మం, కట్టా శివ దుర్గారావు పాల్గొన్నారు